ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం, 16 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

# మల్లన్న సన్నిధిలో నాగన్న



శ్రీశైలం, జూలై 16 (ప్రజాస్వరం) : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో అద్భుతం చోటుచేసుకుంది. మల్లికార్జున స్వామి చెంతకు వాసుకి చేరుకుంది. స్వామి ప్రతిరూపమైన లింగాన్ని చుట్టుకుని కనిపించడంతో భక్తులు మైమరిచిపోయారు. ఈ అరుదైన దృశ్యాన్ని చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. నంద్యాల జిల్లా నల్లమల అడవుల్లోని ప్రసిద్ధ శ్రీశైల క్షేత్రం నిత్యం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ క్షేత్రంలోని పాతాళ గంగ వద్ద చంద్రలింగం ఉంది. భక్తులు నిత్యం దర్శించుకునే ఈ లింగం వద్ద మంగళవారం అద్భుతం జరిగింది. చంద్రలింగాన్ని దర్శించుకోవడానికి వెళ్లిన భక్తులకు లింగాన్ని చుట్టుకున్న నాగుపాము కనిపించింది. ఇది చూసి మల్లికార్జున స్వామి వద్దకు వాసుకి వచ్చి చేరిందని విశ్వసిస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. ఈ విషయం తెలిసి భక్తులు ఆలయానికి పోటెత్తారు. కాగా, అటవీ ప్రాంతం కావడంతో ఆలయం చుట్టుపక్కల పాములు తిరుగాడటం సాధారణమే కానీ ఇలా లింగాన్ని ఓ పాము చుట్టుకుని కనిపించడం అసాధారణమని ఆలయ సిబ్బంది తెలిపారు. గతంలో ఇలాంటి సంఘటన జరిగినట్లు వినలేదని పేర్కొన్నారు. ఈ అసాధారణ దృశ్యాన్ని కొంతమంది భక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది.

## సీఎం ఎమోషనల్ ట్వీట్



హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం): తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భావోద్వేగ ట్వీట్ చేశారు. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీని చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని రేవంత్ రెడ్డి ట్వీట్ లో పేర్కొన్నారు. ఎంత కష్టమైనా, ఎంత భారమైనా, ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని తేల్చిచెప్పారు. అన్నం పెట్టే రైతును అప్పుల ఊబి నుంచి ఆశల సాగు క్షేత్రం వైపు నడిపించే బృహత్తర సాహసమే రైతు రుణమాఫీ పథకమని అభివర్ణించారు. ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమైన ఘనత అని అన్నారు. నాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో దేశ రైతాంగానికి, నేడు ప్రజాప్రభుత్వ పాలనలో తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ అందించే భరోసా అని చెప్పుకొచ్చారు. రుణమాఫీ అమలులో తొలి అడుగు కేబినెట్ ఆమోదం కాగా, మలి అడుగు విధివిధానాల ఖరారు అని సీఎం తెలిపారు. ప్రజాప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయంలో రైతు సంక్షేమ కోణం ఉంటుందని పేర్కొన్నారు. 'ఇది రైతన్నకు.. మీ రేవంతన్న మాట' అంటూ ముఖ్యమంత్రి మంగళవారం ట్వీట్ చేశారు.

# తెలంగాణ రైతన్నకు మీ రేవంతన్న మాట

### ఎంత కష్టమైనా.. ఎంత భారమైనా ఏక కాలంలో రైతు రుణమాఫీ

### పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీకి కార్యాచరణ

### రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య

# వారధి... కలెక్టర్లు

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు, కమిషనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం కలెక్టర్ల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్లు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు సంక్షేమ పథకాలు కొన్ని జిల్లాల్లో కింది స్థాయి వరకు వెళ్లడం లేదనీ.. రైతు భరోసా అభిప్రాయ సేకరణ కోసం జిల్లాలకు వెళ్లినప్పుడు ఈ విషయం అర్థమైందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని పది లక్షలకు పెంచడం, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి అర్హులందరికీ ఆ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఇది ప్రజా పాలన, ప్రజా ప్రభుత్వం అనే సందేశాన్ని స్పష్టంగా ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తే పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతాయన్నారు.

'క్షేత్రస్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి. ఏసీ గదులకే పరిమితమైతే మీకు కూడా సంతృప్తి ఉండదు. డిసెంబర్ 24న కలెక్టర్లతో తొలిసారి భేటీ నిర్వహించాం. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించాం. ఎన్నికల కోడ్ ముగియగానే కలెక్టర్ల బదిలీలు నిర్వహించాం. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చినవారున్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించవచ్చు. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలి. ప్రజలకు లబ్ధి చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలి. ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకునేలా పనిచేయాలి' అని రేవంత్ అన్నారు.

ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. 9 కీలక అంశాలతో ప్రభుత్వం ఎజెండా రూపొందించింది. ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం – కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం – సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతి భద్రతలు – ఇతర భద్రతాపరమైన అంశాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం తదితర అంశాలను అందులో ఉన్నాయి. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. పలు ముఖ్యమైన అంశాలపై అధికారులు వ్యవహరించాల్సిన తీరుపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

# అంగన్వాడీలకు గుడ్ న్యూస్

### రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు సర్కారు ఓకే

### టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష

### రెండ్రోజుల్లో జీవో జారీ.. మంత్రి సీతక్క ప్రకటన

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం): తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు మంత్రి సీతక్క శుభవార్త ప్రకటించారు. ఇకపై పదవీ విరమణ చేసే సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిస్తామని తెలిపారు. రెండు మూడు రోజులలో దీనికి సంబంధించి జీవో జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ లోని రహమత్ నగర్ లో జరిగిన 'అమ్మ మాట– అంగన్వాడీ బాట' కార్యక్రమంలో మంత్రి సీతక్క ఈ ప్రకటన చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద పదవీ విరమణ పొందే టీచర్ కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష చొప్పున తెలంగాణ ప్రభుత్వం అందజేయనుంది. నామమాత్రపు వేతనంతో సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి తెలుసని మంత్రి చెప్పారు.



అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, రెండు మూడు రోజుల్లో ఈమేరకు జీవో విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు చేయాల్సిందే..

### స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు



హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం): నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు బీఆర్ఎస్ నేతల బృందం మంగళవారం ఫిర్యాదు చేసింది. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలు, పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని సభాపతి దృష్టికి తెచ్చామన్నారు. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్నారు. ఫిరాయింపులపై సుప్రీం కోర్టు తీర్పును సభాపతి దృష్టికి తెచ్చామన్నారు. ఫిరాయింపులపై వచ్చిన ఫిర్యాదులపై 3 నెలల్లో చర్యలు తీసుకోవాలని కోర్టు తెలిపిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును స్పీకర్‌కు చదివి వినిపించానని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా న్యాయ్ పత్ర అంటూ మేనిఫెస్టో విడుదల చేసిందని అందులో స్పష్టంగా ఫిరాయింపులు చేసిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీలో చేరితే ఇదే హస్తం పార్టీ కొట్లాడుతోందని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ రూ.50 కోట్లకు కొంటుందని సీఎం సిద్ధరామయ్య ఆరోపిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీ ఫామ్ ఇచ్చే సందర్భంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వారితో పార్టీ మారబోమని ప్రమాణం చేయించారని గుర్తు చేశారు.

### కుటుంబాన్ని నిర్ధారించడానికే

# రేషన్‌కార్డ్

### 2018లో అవలంబించిన విధానాలే ఇప్పుడూ అమలు

### మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం): రైతు రుణమాఫీకి రేషన్ కార్డ్ నిబంధనపై బీఆర్ఎస్ విమర్శలు గుప్పించింది. ఈ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సాయంత్రం వివరణ ఇచ్చారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీకి రేషన్ కార్డు కేవలం కుటుంబాన్ని నిర్ధారించడానికేనని స్పష్టం చేశారు. కుటుంబం నిర్ధారణ కాగానే మిగతా వారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందని వివరించారు.
2018లో అవలంబించిన విధానాలనే ఇప్పుడు అమలు చేస్తున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వం ఆరేడు నెలల్లోనే రూ.2 లక్షల రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేస్తున్నామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంపై బురద జల్లాలనుకోవడం సరికాదన్నారు.

# కేసీఆర్‌కు బిగ్ రిలీఫ్..

### విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్‌ను మార్చాలని సర్కారుకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, జూలై 16 (ప్రజాస్వరం): సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ చైర్మన్ ను మార్చాలని తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. చైర్మన్ ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మధ్యాహ్నం 2 గంటలకు కమిషన్ చైర్మన్ గా మరో పేరును వెల్లడిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ను ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం, గులాబీ బాస్ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో కేసీఆర్ తరఫున ముకుల్ రోహత్గి, తెలంగాణ ప్రభుత్వం తరఫున సిద్ధార్థ లూథ్రా, కమిషన్ తరఫున గోపాల్ శంకర్ నారాయణన్ తమ వాదనలు వినిపించారు. అయితే ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా త్రిసభ్య ధర్మాసనం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ పై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ పూర్తి కాకముందే జస్టిస్ నరసింహారెడ్డి ఓ అభిప్రాయానికి వచ్చారంటూ కోర్టు ఆక్షేపించింది. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ చైర్మన్ ప్రెస్ మీట్ పెట్టడం సరికాదని పేర్కొంది. అయితే, వెంటనే కమిషన్ జడ్జిని మార్చేందుకు ప్రభుత్వానికి అవకాశం ఇస్తున్నామని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు. వాదనల అనంతరం విచారణ కమిషన్ చైర్మన్ ను మార్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

